జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 29 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 8


## పాఠశాల, ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్ ,సెప్టెంబరు 28, (ప్రజా జ్యోతి) :** చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాత కొత్త గూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యా ప్రమాణాలు, పరిసరాల పరిశుభ్రతతో పాటు ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, ల్యాబొరేటరీ సేవలను పరిశీలించారు. ముందుగా చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను

మిగతా 2 లో...

- అధికారం ఉన్నా భద్రాద్రిలో దక్కని ఆధిపత్యం
- ఎమ్మెల్యేలు ఉన్నా కార్యకర్తల్లో లేని ఉత్సాహం
- ఫిరాయింపు నేతల పెత్తనంతో నలిగి పోతున్న అసలైన నాయకత్వం
- కార్పొరేషన్‌లో హంగ్.. పదవులు రాక కార్పొరేటర్ల నిరాశ
- పోలీసులపై చోటా నేతల ఒత్తిడి.. ప్రజల్లో తగ్గుతున్న నమ్మకం
- సమన్వయ లేమితో క్రమంగా పుంజుకుంటున్న ప్రతిపక్షం




# కాంగ్రెస్‌కు గడ్డు కాలమే..!

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 28, ప్రజాజ్యోతి :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం పరిస్థితి రోజురోజుకూ బలహీనపడుతోంది. ప్రధానంగా జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉన్న నేతలు ఉన్నప్పటికీ, ఆ బలాన్ని పార్టీ సంస్థాగత పునాదిగా మార్చుకోవడంలో నాయకత్వం తీవ్రంగా విఫలమవుతోంది. దీనికి తోడు ఒకవైపు మిత్రపక్షమైన సీపీఐ స్థానికంగా తన పట్టును నిలబెట్టుకుంటూ కాంగ్రెస్‌కు సవాల్ విసురుతుండగా, మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ మళ్లీ పుంజుకునేందుకు వేగంగా పావులు కదుపుతోంది. ఈ పరిణామాలకు తోడు జిల్లాలోని కొందరు చోటా మోటా నేతలు అధికారులపై ఒత్తిళ్లు తేవడం

మిగతా 2 లో...

## పల్లె ప్రగతిపై ఎమ్మెల్యే జారే దృష్టి




- దమ్మపేట మండలంలో రూ.84 లక్షల పనులకు శ్రీకారం
- ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే

**దమ్మపేట, సెప్టెంబరు. 28 (ప్రజా జ్యోతి):** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి కొత్తగా చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మొత్తం సుమారు రూ.84 లక్షల విలువైన పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. మొండివర్రె గ్రామంలో నిర్వహించిన 'హలో శుభోదయం' కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను తెలుసుకోవడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జగ్గారం గ్రామంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనం

మిగతా 2 లో...

## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 28,(ప్రజాజ్యోతి)** ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తక్షణమే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు

మిగతా 5 లో...

## రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 28 ,(ప్రజా జ్యోతి)** రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థలను పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కొత్తగూడెం ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యతో పాటు వారికి అందుతున్న మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కలెక్టర్లు తప్పనిసరిగా రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నప్పటికీ కొన్ని చోట్ల ఆహార విషబాధ, ఎలుకలు, పాముకాటు

మిగతా 5 లో...

## పల్లె ప్రగతిపై ఎమ్మెల్యే జారే దృష్టి





(మొదటి పేజీ తరువాయి...)

రూ.10 లక్షలతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. కొడిసెలగూడెంలో నిర్మించిన రూ.12 లక్షల అంగన్‌వాడీ భవనం, నాయుడుపేట పంచాయతీ పరిధిలోని తాటిసుబ్బన్నగూడెంలో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. పట్వారిగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు.

**క్రీడలతో ఆరోగ్యం.. క్రమశిక్షణ**

మందలపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రారంభమైన అశ్వారావుపేట జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండలస్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు

- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం







**దమ్మపేట, సెప్టెంబరు.28 (ప్రజాజ్యోతి):** సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా దమ్మపేట మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మండలంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, సెయింట్ మేరీస్ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.కార్యక్రమంలో దమ్మపేట మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు గడ్డు కాలమే..!

(మొదటి పేజీ తరువాయి...)

, ఫలితంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడటం కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠను తీవ్రంగా దెబ్బతీస్తోంది.

**నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ లేదు..**

జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్‌కు నాలుగు, సీపీఐకి ఒక స్థానం ఉంది. సంఖ్యాపరంగా కాంగ్రెస్ బలంగానే ఉన్నప్పటికీ.. గ్రామ, మండల స్థాయిల్లో పార్టీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. దీనికి ప్రధాన కారణం జిల్లా కాంగ్రెస్ బాధ్యతలను మహిళా నాయకురాలికి అప్పగించినప్పటికీ, కీలక నిర్ణయాలన్నీ జిల్లా కేంద్రంలో చెలామణి అవుతున్న కొందరు చేరిన నేతలు, రాష్ట్రస్థాయి నాయకుల చేతుల్లోనే ఉండిపోవడమేనని తెలుస్తోంది.

ఫలితంగా మొదటి నుంచి పార్టీని నమ్ముకున్న అసలైన స్థానిక నాయకులకు నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ లేకుండా పోయి, క్షేత్రస్థాయి కార్యకర్తలు తీవ్ర అయోమయంలో పడుతున్నారు.

**పనులు రాక కార్పొరేటర్ల నిరాశ..**

ఇదే క్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు కూడా జిల్లా కాంగ్రెస్ అంతర్గత బలహీనతను స్పష్టంగా బయటపెట్టాయి. ఇక్కడి మొత్తం 60 డివిజన్లలో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 స్థానాలు గెలుచుకోగా, బీఆర్ఎస్ 8 స్థానాలు సాధించడంతో హంగ్ ఏర్పడింది. దీంతో అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్ సొంతంగా మేయర్ పీఠాన్ని దక్కించుకోలేకపోయింది. ఈ నేపథ్యంలోనే ఒప్పందంలో భాగంగా సీపీఐకి చెందిన మూడ్ గణేశ్ మేయర్‌గా, కాంగ్రెస్‌కు చెందిన సిరిపురపు లలితా కుమారి డిప్యూటీ మేయర్‌గా బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. ఇక దీంతో ఇక్కడి కార్పొరేటర్ల పరిస్థితి మరి దారుణంగా తయారైంది.

ఎన్నికల్లో భారీగా ఖర్చు చేసి గెలిచిన కాంగ్రెస్ కార్పొరేటర్లకు తగిన ప్రాధాన్యం కానీ, తమ డివిజన్లలో అభివృద్ధి పనులు చేసుకునే అవకాశం కానీ దక్కడం లేదు. ఇక్కడి చిన్నచితిగా పనులతో పాటు పెద్దవి కూడా సిపిఐ కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. దీంతో కాంగ్రెస్ కార్పొరేటర్ల పరిస్థితి మరి అధ్వానంగా తయారైంది. దీని ఫలితంగా పట్టణ స్థాయిలో పార్టీకి బలంగా నిలవాల్సిన కార్పొరేటర్లే తీవ్ర నిరాశలో కూరుకుపోవడంతో, ఆ ప్రభావం నేరుగా కిందిస్థాయి శ్రేణులపై పడుతోంది.

**ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు కలిసివస్తున్న అవకాశం..**

మరోవైపు అధికార పార్టీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, స్థానిక సమస్యలపై స్పందించడంలోనూ జిల్లా నేతలు కావలసినంత చొరవ చూపడం లేదు. ప్రధానంగా జిల్లా నేతల పనితీరుపై పైస్థాయి నుంచి పర్యవేక్షణ లేకపోవడం, కొందరు నేతలు తమ సొంత ప్రయోజనాల కోసమే వ్యవహరిస్తుండటం పార్టీకి పెద్ద లోటుగా మారింది. దీనికి తోడు మిత్రపక్షమైన సీపీఐతో కూడా స్థానిక స్థాయిలో సరైన సమన్వయం కుదరడం లేదు. కాంగ్రెస్ నేతల ఈ మౌనాన్ని, అంతర్గత విబేధాలను ఆసరాగా చేసుకుని ప్రతిపక్ష బీఆర్ఎస్ జిల్లాలో మళ్లీ ప్రజల్లోకి వెళ్లేందుకు వేగంగా పావులు కదుపుతోంది. ఇకనైనా కాంగ్రెస్ ఈ చర్యలను సరిదిద్దుకోలేదంటే.. జిల్లాలో మరింత గడ్డు పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుంది.

## పోలీసుల పనితీరు.. కాంగ్రెస్ పైనే మరక..

వీటితో పాటు జిల్లాలోని కొన్ని పోలీస్ స్టేషన్లలో స్థానిక కాంగ్రెస్ చోటా మోటా నాయకుల జోక్యం పరిమితి దాటుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా తమకు కావలసిన అడ్డగోలు పనుల కోసం పైస్థాయి నేతలతో అధికారులకు ఫోన్లు చేయించి ఒత్తిడి తెస్తుండటంతో, పోలీసులు చట్టాన్ని పక్కనబెట్టి నేతలు చెప్పినట్లే నడుచుకోవాల్సి వస్తోంది. ఈ పరిణామాల ఫలితంగా న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే సామాన్యుల పిటిషన్లను కూడా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా రేగళ్ల పరిసర ప్రాంతాల్లో జరిగిన ఘటనను చెప్పుకోవచ్చు. ఇక్కడ ఒక కౌలు రైతు విషయంలో కొందరు స్థానిక నేతలు తమ రాజకీయ బలాన్ని అడ్డుపెట్టుకుని, ఆ రైతు కష్టపడి వేసుకున్న పంట పొలాన్ని నరికివేసి నష్టం కలిగించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బాధితుడు పోలీసులను ఆశ్రయించినా అధికారులు స్పందించకపోవడం గమనార్హం. ఇలా చట్టం ప్రకారం పనిచేయాల్సిన పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడం వల్ల వారిపై ప్రజలకు ఉన్న నమ్మకం క్రమంగా సన్నగిల్లుతోంది. అంతిమంగా ఈ తరహా ఘటనలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠకే తీవ్ర నష్టం కలిగిస్తాయని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

# పాఠశాల, ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్





(మొదటి పేజీ తరువాయి...)

కలెక్టర్ సందర్శించి పరిశీలించారు, అనంతరం ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేసి విధులకు హాజరైన, సెలవులో ఉన్న ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికలో నమోదైన వివరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఆయా తరగతి గదుల్లో అందుబాటులో ఉన్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు.

అదేవిధంగా కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై వారి అవగాహనను తెలుసుకున్నారు. పదవ తరగతి గదిలో ఉపాధ్యాయుడు అందుబాటు లో లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీశా రు. ఇందుకు సరైన సమాధానం లేకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు ,పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, గత విద్యా ఫలితాలు, ప్రస్తుత విద్యా ప్రగతికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై అదనపు దృష్టి సారించాలని సూచించారు.

అనంతరం పాత కొత్తగూడెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆరోగ్య కేంద్రం పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు, వైద్యాధికారితో మాట్లాడి కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, రోజువారీగా వచ్చే ఓపీ రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ సుమారు 50 నుంచి 60 మంది వరకు ఓపీకి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

రోగులకు ఎ లాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలను అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి మందుల నిల్వలను తనిఖీ చేశా రు.

మందులను నిబంధనల ప్రకారం సక్రమంగా నిల్వ చేయాలని, మం దుల గడువు తేదీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు.

గడు వు ముగిసిన మందులను గుర్తించి నిబంధనల ప్రకారం వెంటనే తొలగించాలని ఆదేశించారు, అదేవిధంగా ల్యాబొరేటరీని కలెక్టర్ పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్‌తో మాట్లాడి రోగులకు నిర్వహిస్తున్న రక్త పరీక్షలు, డెంగ్యూ, మలేరియా నిర్ధారణ పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మలేరియా నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉన్నాయని, డెంగ్యూ నిర్ధారణ కిట్ల కోసం ఇప్పటికే ఇండెంట్ పెట్టినట్లు సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అవసరమైన పరీక్షా కిట్లు, మందులు ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తాసిల్దార్ నాగరాజు, ఎంఈఓ నీరజ, పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, నర్సులు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పట్టు తప్పితే.. ప్రమాదమే!

- విద్యార్థులంటే అంత అలుసా?
- కూలీలా.. విద్యార్థులా!
- విద్యార్థులను బొలెరో ట్రాలీలో తరలిస్తున్న వైనం
- ఇల్లందులో విద్యార్థులకు క్రీడా పోటీల నిర్వహణ
- ఇష్టానుసారంగా విద్యార్థులను తరలించడం ఏమిటని ప్రశ్నలు
- ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు!
- క్రీడా ప్రాంగణంలో విద్యార్థులచే వెట్టి చాకిరి?
- టెంట్లను తీస్తున్న చిన్నారి చేతులు!
- నిర్వాహకుల తీరు పట్ల సర్వత్ర విమర్శలు







**ఇల్లందు, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** చిన్నారి చేతులతో పెన్నులు పట్టాల్సింది పోయి వారితో టెంట్లను తీయిస్తున్న ఘటన కండ్లకు కనిపిస్తుంది. అంతేకాకుండా వారితో టెంట్ కు సంబంధించిన కర్రలను, టెంట్ కు ఉపయోగించే రాడ్లను, కుర్చీలను సైతం ఆ చిట్టి చేతులతో మోయించటం ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బావి తరానికి బంగారు బాటలు వేయాల్సిన చిన్నారులచే ఇలా పనులు చేయించడం పట్ల పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా విద్యార్థుల భద్రత విషయంలో నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎక్కడా కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇల్లందులో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించిన సందర్భంగా వారిని బొలెరో ట్రాలీలో తరలించిన ఘటన చర్చనీయాంశంగా మారింది. చిన్నారుల భద్రతను పక్కనపెట్టి ఇష్టానుసారంగా తరలించడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ వాహనం పట్టు తప్పితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పితే విద్యార్థుల పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ›› కూలీలా.. విద్యార్థులా?

క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులను సురక్షితమైన వాహనాల్లో తరలించాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంటుంది. అయితే ఇందుకు భిన్నంగా బొలెరో ట్రాలీలో విద్యార్థులను ఇష్టానుసారంగా తరలించడం పట్ల తల్లిదండ్రులు, స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులను ఇలా తరలించడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తున్నారు.

### ›› పట్టు తప్పితే.. పెను ప్రమాదమే

ట్రాలీలో విద్యార్థులను తరలించే సమయంలో వాహనం పట్టు తప్పినా, అకస్మాత్తుగా బ్రేకులు వేసినా చిన్నారులు కిందపడే ప్రమాదం ఉంటుంది. రహదారిపై ప్రయాణించే సమయంలో ఇతర వాహనాలు ఢీకొనే అవకాశం కూడా లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం సరికాదని అంటున్నారు.

### ›› క్రీడల పేరుతో భద్రతకు తిలోదకాలు?

విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమే అయినప్పటికీ, అందుకు వచ్చే విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇల్లందులో జరిగిన క్రీడా కార్యక్రమంలో విద్యార్థుల తరలింపు విధానం మాత్రం నిర్వాహకుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించేలా ఉందని పలువురు అంటున్నారు.

### ›› క్రీడా ప్రాంగణంలో చిన్నారులతో పనులు?

ఇదే కార్యక్రమానికి సంబంధించిన మరో అంశం కూడా చర్చకు వస్తుంది. క్రీడా ప్రాంగణంలో క్రీడలు పూర్తయినా అనంతరం ఆ స్థలంలో ఉన్న స్టేజి, స్టేజి పరిసర ప్రాంతాల్లో విద్యార్థులతో టెంట్లను తొలగించే పనులు చేయించిన దృశ్యాలు కనిపించాయని స్థానికులు చెబుతున్నారు. చదువుకోవాల్సిన, క్రీడల్లో పాల్గొనాల్సిన చిన్నారుల చేతులతో ఇటువంటి పనులు చేయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

### ›› వెట్టిచాకిరీ చేయించడంపై విమర్శలు!

విద్యార్థులను క్రీడా కార్యక్రమాలకు తీసుకొచ్చి, అనంతరం టెంట్లు తొలగించడం, ఇతర పనుల్లో నిమగ్నం చేయడం సరైన విధానం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థులు కూలీలు కాదని, వారితో శారీరక శ్రమ చేయించకుండా నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### ›› ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు?

విద్యార్థుల భద్రత విషయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా తీవ్ర పరిణామాలకు దారితీసే అవకాశం ఉంది. ముఖ్యంగా రవాణా విషయంలో నిబంధనలకు అనుగుణంగా వాహనాలను వినియోగించాల్సిన అవసరం ఉంది. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా అధికారులు, నిర్వాహకులు ఇప్పటికైనా విద్యార్థుల భద్రతపై దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

### ›› నిర్వాహకుల తీరుపై సర్వత్రా విమర్శలు

క్రీడా పోటీల పేరుతో విద్యార్థులను ప్రమాదకరంగా తరలించడం, కార్యక్రమం అనంతరం వారితో టెంట్లు తొలగించే పనులు చేయించడం వంటి అంశాలు వెలుగులోకి రావడంతో నిర్వాహకుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల భద్రత విషయంలో రాజీపడకుండా భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్య లు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### ›› విద్యార్థుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత

క్రీడా పోటీలు నిర్వహించడం ఎంత ముఖ్యమో, వాటికి హాజరయ్యే చిన్నారులను సురక్షితంగా తీసుకురావడం, తీసుకెళ్లడం అంతకంటే ముఖ్యమని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇలా విద్యార్థులను విద్యార్థులుగా కాకుండా వారితో టెంట్లు తీయించడం, టెంట్లకు సంబంధించిన రాడ్లను తొలగించడం, టెంట్లను మరవడం మల్టీ పనులు చేయించడం సరికాదని, భవిష్యత్తులో మరల ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## వినాయక మండప కమిటీలకు సీఐ అభినందనలు

- నిమజ్జన కమిటీల సేవలు అభినందనీయం: సీఐ వెంకటేశ్వరరావు



**పినపాక, సెప్టెంబర్ 27(ప్రజాజ్యోతి)** పినపాక, కరకగూడెం మండలాల్లో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు, విగ్రహ నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా శాంతియుతంగా ముగియడంపై సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై సురేష్ హర్షం వ్యక్తం చేశారు.వినాయక మండప కమిటీ సభ్యులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను క్రమశిక్షణతో నిర్వహించడం అభినందనీయమని సీఐ అన్నారు . శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు శాఖకు సహకరించిన అన్ని వినాయక మండప కమిటీలు, నిర్వాహకులు, యువకులు, స్వచ్ఛంద సేవకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఉత్సవాల విజయవంతమైన నిర్వహణకు పోలీసు సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు, ఇతర ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేయడం వల్లే కార్యక్రమాలు ప్రశాంతంగా పూర్తయ్యాయని సీఐ తెలిపారు.భవిష్యత్తులో కూడా ప్రజలు ఇదే విధంగా పోలీసు శాఖకు సహకరించి పట్టణంలో శాంతి, సామరస్య వాతావరణం కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు.

## ఎస్జీటీల పై పనిఒత్తిడి తగ్గించాలి

- సేవ్ ప్రైమరీ టీచర్ నినాదంతో నిరసన



చర్ల, సెప్టెంబర్ 28 :(ప్రజా జ్యోతి):ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ చర్ల మండల ఉపాధ్యాయులు సోమవారం నిరసన చేపట్టారు.జెడ్పీహెచ్ ఎస్ బాలికల పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశం అనంతరం ఉపాధ్యాయులు 'సేవ్ ప్రైమరీ టీచర్ –సేవ్ ప్రైమరీ స్కూల్' నినాదాలతో ఆందోళన వ్యక్తం చేశారు.ఎఫ్ ఎల్ ఎన్, రెమిడేషన్, ఆన్ లైన్ పనులు, అధిక రికార్డుల నిర్వహణ, కాంప్లెక్స్ హెచ్ ఎం పర్యవేక్షణ, పాఠశాల పరిపాలన తదితర అదనపు బాధ్యతలతో ఎస్జీటీ ఉపాధ్యాయులపై తీవ్ర పనిభారం పెరుగుతోందని వారు అన్నారు. ముఖ్యంగా ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్న పాఠశాలల్లో అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.జీవో 25ను సవరించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో విద్యావాలంటీర్లను నియమించాలని కోరారు. బోధనేతర పనులను తగ్గించడంతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఇటీవల జగిత్యాల జిల్లా చిల్వకోడూరు పాఠశాల ఉపాధ్యాయుడు ప్రశాంత్ కాంప్లెక్స్ సమావేశం సందర్భంగా తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనను ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రస్తావించారు. ఉపాధ్యాయులపై పెరుగుతున్న పనిభారం, ఒత్తిడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని కోరారు.క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిశీలించి, బోధనకు ఆటంకం కలిగించే అదనపు పనులను తగ్గించి ఉపాధ్యాయులపై పనిఒత్తిడిని తగ్గించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు.

## భగత్ సింగ్ ఆశయాలను యువతలో విస్తృతంగా ప్రచారం చేయాలి

- ఏఐవైఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి సాధనపల్లి సతీష్




**భద్రాచలం, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** భగత్ సింగ్ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఏఐవైఎఫ్ భద్రాద్రి జిల్లా సంయుక్త కార్యదర్శి సాధనపల్లి సతీష్అన్నారు. భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా సోమవారం భద్రాచలంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ సీనియర్ నాయకులు మారెడ్డి శివాజీ, నాయుడు భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చెర నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన మహనీయ విప్లవకారుడు భగత్ సింగ్ అని అన్నారు. సమసమాజ స్థాపనే తన జీవిత లక్ష్యంగా ప్రకటించిన ఆయన అందించిన "ఇంక్విలాబ్ జిందాబాద్" నినాదం నేటికీ యువతలో ఉద్యమ స్ఫూర్తిని రగిలిస్తూ పోరాటాలకు దిశానిర్దేశం చేస్తోందన్నారు.భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకుని సభలు, సమావేశాలు, సదస్సులతో పాటు రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, వ్యాసరచన పోటీలు తదితర సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆయన ఆశయాలను యువతలో విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు శోభన్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కొక్కిరేణి అశోక్ కుమార్, పట్టణ నాయకులు కొండా కౌశిక్, పసుపులేటి సాయి, ఎస్కే కాసిం పాల్గొన్నారు.

## రోగులకు పౌష్టికాహారం పంపిణీ



**చర్ల, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** కీర్తిశేషులు బానోత్ హట్యాసింగ్, రిటైర్డ్ ఎంపీడీవో వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, ఏపీఆర్‌జేసీ–నాగా ర్జున సాగర్ మిత్రుడు బానోత్ రమణ అందించిన రూ.5 వేల విరాళంతో చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయాలసిస్ రోగులకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. 'మీకోసం మేమున్నాం' బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డయాలసిస్ కేంద్రం ఇన్‌చార్జి నిమ్మల భాస్కర్ చేతుల మీదుగా రోగులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ లయన్ నీలి ప్రకాష్ మాట్లాడుతూ పేదలు, అనారోగ్యంతో బాధపడు తున్న వారికి అండగా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. పేదలకు ఉపయోగకరంగా ఉండే సేవా కార్యక్రమాలకు దాతలు విరివిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి శ్రీని వాసరావు, అక్కినేని నెహ్రూ, దొడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి




**భద్రాచలం, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ మంచి నడవడికతో మెలగాలని ప్రభుత్వ జూనియర్ కళా శాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి అన్నారు. కళాశాలలో హెల్ప్, మై భారత్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కావద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఆలోచనా శక్తి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తీవ్రంగా దెబ్బతినడంతో పాటు అనేక ఆరోగ్య సమ స్యలు తలెత్తుతాయని తెలిపారు. చెడు వ్యసనాలకు అలవాటుపడితే చదువు ప్రశ్నార్థకంగా మారి భవిష్యత్తు అంధకారమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సంపత్ కుమార్, పద్మావతి, స్వరూప, ఎన్ఎస్ఎ స్ సమన్వయకర్త ఆనంద్ బాబు, హెల్ప్ కౌన్సిలర్ శ్రీనివాసరావు, మై భారత్ సమన్వయకర్త పిండిగ శ్రీనివాస్, లక్ష్మీప్రసన్న, మాన్‌సింగ్, జయప్రసాద్, బాల కృష్ణ, నాగకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామయ్య హుండీ ఆదాయం రూ.2.12 కోట్లు





**భద్రాచలం, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి ):** భద్రాచలంలోని శ్రీ సీతారా మచంద్రస్వామి దేవ స్థానంలో 98 రోజుల అనంతరం సోమవారం హుండీ కానుకలను తెరిచి లెక్కించారు. జూన్ 22, 2026 తర్వాత భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.2,12,40,214 నగదు ఆదాయం సమకూరినట్లు దేవ స్థానం ఈఓ దామోదర్‌రావు తెలిపారు. అలాగే 170 గ్రాముల మిశ్రమ బంగారం, 1.400 కిలోల మిశ్రమ వెండి కానుకలు వచ్చినట్లు వెల్లడించారు. వివిధ దేశాలకు చెందిన విదేశీ కరెన్సీ కూడా హుండీలో లభించిందని, అమెరికా డాలర్లు 545, ఖతార్ రియాళ్లు 11, యూఏఈ దిర్హామ్‌లు 135, ఇంగ్లాండ్ పౌండ్లు 110, నేపాల్ రూపీలు 140, కువైట్ దినార్లు 6, కెనడా డాలర్లు 50, ఆస్ట్రేలియా డాలర్లు 60, యూరోలు 30, సింగపూర్ డాలర్లు 60, ఒమన్ రియాళ్లు 1, మలేషియా రింగిట్ 1, భూటాన్ న్గుల్ట్రమ్‌లు 10, బహ్రెయిన్ దినార్ 1 చొప్పున లభించాయి. పట్టణ పోలీసుల బందోబస్తు మధ్య దేవస్థానం సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు హుండీ కానుకల లెక్కింపును జరిపారు.

# బిల్లులకు ఆమోదం.. పనులపై మౌనం ఎందుకు?

- దుగినేపల్లి పంచాయతీ నిధుల ఖర్చుపై గ్రామస్తుల్లో చర్చ
- ఐదు నెలల్లో రూ.7.76 లక్షల వ్యయం.. బినామీ పేర్లతో ఎంబీలపై ఆరోపణలు
- ఒక్కరి పేరుతో రూ.3 లక్షల వరకు బిల్లులంటూ ఆరోపణలు.. కిరణ్ ఎలక్ట్రికల్స్ పేరుతో రూ.1.50 లక్షలపై అనుమానాలు
- ఎంబీలు, బిల్లులను ఆమోదించిన అధికారుల పాత్రపై ప్రశ్నలు
- మండల అధికారుల మౌనంపై గుసగుసలు..
- జిల్లా అధికారులు స్పందించాలని గ్రామస్తుల డిమాండ్




**పినపాక, సెప్టెంబర్ 28(ప్రజాజ్యోతి)** పినపాక మండలంలోని దుగినేపల్లి గ్రామపంచాయతీలో గత ఐదు నెలల్లో సుమారు రూ.7.76 లక్షల మేర నిధులు ఖర్చు చేసినట్లు నమోదవడంపై గ్రామస్తుల్లో చర్చ జరుగుతోంది. రికార్డుల్లో చూపిన ఖర్చుకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పనులకు పొంతన ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొమరం సుధాకర్ పేరుతో గత ఐదు నెలల్లో సుమారు రూ.3 లక్షల వరకు ఎంబీలు, బిల్లులు చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే తనకు పంచాయతీ పనులతో సంబంధం లేదని, తాను ఆన్ లైన్ సెంటర్ నిర్వహిస్తున్నందున తన ఖాతాలోకి డబ్బులు వస్తే సంబంధిత వారికి నగదు రూపంలో తిరిగి ఇస్తున్నానని సుధాకర్ చెబుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో ఆయన పేరుతో నమోదైన పనులు వాస్తవంగా ఎవరు చేశారనే అంశంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదేవిధంగా కిరణ్ ఎలక్ట్రికల్స్ పేరుతో సుమారు రూ.1.50 లక్షల వరకు బిల్లులు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గ్రామంలో జరిగిన విద్యుత్ పనులు, ఏర్పాటు చేసిన సామగ్రిని పరిశీలించి బిల్లుల్లో చూపిన మొత్తానికి వాస్తవ పరిస్థితికి సంబంధం ఉందో లేదో అధికారులు నిర్ధారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ఎంబీలకు ఆమోదం.. అధికారుల మౌనం ఎందుకు?

పంచాయతీ పరిధిలో తయారైన ఎంబీలు, బిల్లులను పరిశీలించి ఆమోదించే బాధ్యత సంబంధిత అధికారులకు ఉంటుంది. అయితే పనులు వాస్తవంగా జరిగాయా? బిల్లుల్లో పేర్కొన్న సామగ్రి సరఫరా జరిగిందా? అనే అంశాలపై క్షేత్రస్థాయి తనిఖీలు జరిగాయా లేదా అనే ప్రశ్నలు గ్రామస్తుల నుంచి వినిపిస్తున్నాయి. డల పరిధిలో సంబంధిత అధికారులు ఉన్నప్పటికీ ఈ వ్యవహారంపై ఎందుకు స్పందించడం లేదనే గుసగుసలు గ్రామంలో వినిపిస్తున్నాయి. ఎంబీలు, బిల్లులను పరిశీలించిన అధికారులు ఎవరు? క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన తరువాతే ఆమోదం ఇచ్చారా? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

### అధికారులు-బిల్లుదారుల మధ్య సంబంధాలపై చర్చ

కొన్ని పనులకు సంబంధించిన బిల్లులు ఎవరి పేర్లతో జరిగాయి? ఆయా వ్యక్తులకు వాస్తవంగా పనులతో సంబంధం ఉందా? బిల్లులు పొందిన వ్యక్తులకు, సంబంధిత అధికారులకు ఏమైనా వ్యక్తిగత లేదా కుటుంబ సంబంధాలు ఉన్నాయా? అనే అంశాలపై గ్రామంలో చర్చ జరుగుతోంది. ఈ అంశాలపై అధికారులు రికార్డుల ఆధారంగా స్పష్టత ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### జిల్లా అధికారులు స్పందించాలి

పంచాయతీ నిధుల వినియోగంపై పలు ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండల స్థాయిలో జరిగిన పనులు, ఎంబీలు, బిల్లులు, చెల్లింపులపై జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక విచారణ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా అధికారులు స్వయంగా రికార్డులను పరిశీలించడంతో పాటు, క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేసి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిరాధారమైతే పూర్తి వివరాలను వెల్లడించి ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ప్రజాధనంపై పారదర్శకతకు డిమాండ్

గత ఐదు నెలల్లో జరిగిన అన్ని పనులకు సంబంధించిన ఎంబీలు, బిల్లులు, వౌచర్లు, బ్యాంకు లావాదేవీలు, సరఫరా బిల్లులు, పనుల ఫోటోలు, పంచాయతీ తీర్మానాలను పరిశీలించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనం వినియోగంలో పారదర్శకత ఉండాలని, పంచాయతీ నిధులకు సంబంధించిన ప్రతి చెల్లింపుపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. దుగినేపల్లి పంచాయతీ వ్యవహారంపై జిల్లా అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

## ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ ను అరెస్టు చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

- కేంద్ర ఎన్నికల సంఘం భ్రష్టు పట్టింది
- కమిషనర్ రాజీనామా చేయాలి
- ధర్నాలో పాల్గొన్న డిసిసి అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో పాటు పాల్గొన్న కొత్వాల





**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 28 , (ప్రజాజ్యోతి )** కేంద్ర ఎన్నికల సంఘం భ్రష్టు పట్టిందని, కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ కాలనీ ఎదుట భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు, ఎఐసిసి, టి.పిసిసి, భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాజీ డిసిఎంఎస్ చైర్మన్ పోతవాల శ్రీనివాసరావు, టీపీసీసీ రాష్ట్ర సభ్యులు నాగ సీతారాములు తో పాటు పలువురు జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం, బి.జె.పి పార్టీ స్వంత సొత్తుగా మారిందనీ, తొత్తుగా వ్యవహరిస్తున్నదనీ, సర్ ప్రోగ్రాం పేరుతో లక్షలాది మంది ఓట్లను తొలగించే కుటిల యత్నాలు చేస్తున్నదని అన్నారు. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వం తొత్తుగా వ్యవహరిస్తున్నదని, లక్షలాది మంది బి.జె.పి యేతర పార్టీల ఓట్లను తొలగిస్తున్నదని, జ్ఞానేశ్వర్ కుమార్‌ను వెంటనే తొలగించి, అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు., రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేవరకు కాంగ్రెస్‌శ్రేణులు విశ్రమించరాదనీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి ప్రచారం చేయాలని కోరారు, అనంతరం ధర్నా చౌక్ నుండి ప్రదర్శనగా కలెక్టర్ కార్యాలయం చేరుకొని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ కు అందజేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల "డ్రాలో" అందరివి డ్రామాలేనా?

- గతంలో తీసిన లక్కీ డ్రాలో వచ్చిన లద్దీదారుల ఆశలు అడియాశలేనా?
- పూర్తికాని ఇళ్లకు డ్రా తీయడమేమిటి?
- ఎన్నిసార్లు డ్రా తీస్తారు!
- గతంలో కూడా లక్కీ డ్రా పరిస్థితి ఇదే- ప్రస్తుత పరిస్థితి కూడా ఇదే?
- అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు డ్రా తీయడం ఇది రెండవసారి!
- ఇక మూడవసారి ఎప్పడంటే,
- పూర్తికాని ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇచ్చేసరికి మరో ప్రభుత్వం ఏర్పడితే మళ్లీ మూడోసారి డ్రా తీయాల్సిందేనా?
- ఈ డబుల్ ఇల్లు పూర్తయ్యేది ఎప్పుడు? అర్హులైన లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరేది ఎప్పుడు?
- గతంలో డ్రాలో వచ్చిన లబ్ధిదారుల కళ్ళల్లో కన్నీటిని మిగిల్చిందెవరు?
- అధికారులా? ప్రజాప్రతినిధులా? మంత్రులా లేక ఎమ్మెల్యేలా

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 28, (ప్రజా జ్యోతి)**

నిరుపేద ప్రజలకు సొంతింటి కల నెరవేర్చేందుకు గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం పాల్వంచలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులకు అందని ద్రాక్షాలా మారింది, వేల కోట్ల వ్యయంతో చేపట్టిన డబుల్ ఇల్లు పూర్తి స్థాయిలో పూర్తికాకుండానే ఆనాడు బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ఆనాటి ఎమ్మెల్యే వనమా సమక్షంలో అప్పటి జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో, ఆర్డీవో, ఆధ్వర్యంలో డబుల్ ఇళ్లకు లక్కీ డ్రా తీసి కొంతమంది అర్హులైన లబ్ధిదారులను వేలమంది నిరుపేదల సమక్షంలో ఎంపిక చేయడం జరిగింది, అప్పుడు ఎంపికైన లబ్ధిదారుల కళ్ళల్లో ఆనంద భాష్పాలు వెళ్ళి విరిసాయి, అయితే డ్రా తీసిన కొన్ని నెలలకే బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందుకు రావడంతో మళ్లీ ఎన్నికలు జరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక నిలిచిపోయినట్లు అయింది, ఇది ఇలా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అదే డబల్ బెడ్ రూమ్ ఇళ్లను తిరిగి గత వారం రోజుల క్రితం మళ్లీ లక్కీ డ్రా తీసి మరి కొంతమంది లబ్ధిదారులను అధికారులు స్థానిక ఎమ్మెల్యే ,జిల్లా కలెక్టర్ ,సమక్షంలో ఎంపిక చేశారు, "ఆనాడు " __ నేడు" కూడా అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను రెండుసార్లు డ్రా తీయడం తో మొదటిసారి డ్రాలో వచ్చిన అర్హులైన లబ్ధిదారుల పరిస్థితి ఏమిటని ఆనాడు ఎంపికైన లబ్ధిదారులు పలువురు అధికారులను, స్థానిక ఎమ్మెల్యేను, జిల్లా కలెక్టర్ ను, ప్రశ్నిస్తున్నారు, వారికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత పైన తెలిపిన అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎంతైనా ఉంది, ప్రస్తుతం రెండవసారి కూడా ఎంపికైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇప్పటికిప్పుడు ఇచ్చేది కూడా లేదనిపిస్తుంది, ఎందుకంటే, గత బిఆర్ఎస్ ప్రభుత్వ అయామ్ లో డబుల్ ఇళ్లకు డ్రా తీసే సమయంలో ఇండ్ల పరిస్థితి ఎలా ఉందో నేడు కూడా డబుల్ ఇండ్ల పరిస్థితి మొండి గోడలతో అడవిని తలపించే విధంగా ఉన్నాయి, అంటే, ,,అసంపూర్తిగా ఉన్న ఈ డబుల్ ఇండ్లు పూర్తిస్థాయిలో పూర్తయ్యేలోపు మళ్లీ 2009లో జరిగే ఎన్నికలు నాటికి పూర్తి చేసి ఇస్తారా? లేక నిన్న గాక మొన్న తీసిన డ్రాలో వచ్చిన లబ్ధిదారులకు కూడా మొండిచేయి చూపిస్తారా

అనేది వేసి చూడాల్సిందేనా? అని పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు, 2009లో మరో ప్రభుత్వం ఏదైనా వస్తే ఇదే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను మూడోసారి డ్రా తీసి అప్పుడు కూడా మరి కొంతమంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారేమో అని పాల్వంచలో పలువురు ఆరోపిస్తుండడం కనిపిస్తుంది, అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తిస్థాయిలో పూర్తి చేసిన తర్వాతనే రెవెన్యూ అధికారులు డివిజన్ వారీగా సర్వే చేసి పార్టీలకు అతీతంగా, కార్పొరేటర్లు కానీ, ఇతర ఎవరి పైరవీలు లేకుండా అసలైన ఇల్లు లేని అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇల్లు మంజూరు చేయాల్సి ఉంది కానీ "ఈ డ్రా పద్ధతి" ఏమిటని పాల్వంచలో పలువురు చర్చించుకోవడం చర్చనీయాంశంగా మారింది, నిన్న గాక మొన్న తీసిన డబుల్ ఇండ్ల "డ్రాలో" కూడా కొంతమంది ఉద్యోగస్తుల భార్యల పేరుపై, అదేవిధంగా మూడంతస్తుల భవన యజమానుల భార్య పేర్లపై డ్రాలో ఇల్లు వచ్చింది, కానీ అదే ఇంట్లో కిరాయికి ఉండే వారు దరఖాస్తు చేసుకుంటే వారికి మాత్రం 'డ్రాలో" ఇల్లు రాలేదు, ఇది ఎంతవరకు సమంజసం అని, అదేవిధంగా సొంత ఇల్లు ఉండి అదే ఇంట్లో నివాసముంటున్న వారికి కూడా డ్రాలో ఇల్లు రావడంతో అసలైన నిరుపేదల పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు, "డ్రా" పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసే పద్ధతిలో ఒకరికి న్యాయం జరుగుతుంది, మరొకరికి అన్యాయం జరుగుతుంది, కావున ఇప్పటికైనా డ్రా పద్ధతి ద్వారా కాకుండా డివిజన్ వారీగా ప్రభుత్వ అధికారులు అసలైన నిరుపేదలను గుర్తించి ఇల్లు లేని వారికి డబల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు, డ్రా పద్ధతి ద్వారా అయితే ఒకవేళ ఇల్లు ఉన్నవారి పేరు డ్రాలో వచ్చిందనుకో, డ్రా లో ఇల్లు లేని వారికి డ్రాలో రాకపోతే వారి పరిస్థితి ఎలా ఉంటుందంటే -మీరు మీరు ఏమైనా చేసుకోండి మేము అయితే లబ్ధిదారులను ఎంపిక చేసామని ప్రభుత్వ అధికారులు చేతులు దులుపుకోవడం చూస్తుంటే ఇది ఎంతవరకు సమంజసమని పాల్వంచ పట్టణ ప్రజలు పలువురు ఆరోపిస్తున్నారు, ఇది ఇలా ఉండగా అసలైన లబ్ధిదారుల ఎంపికను అధికారులు చేయలేకపోతున్నారా ? లేక ఏమిటని ప్రశ్నిస్తున్నారు, ఇప్పటికైనా పాల్వంచలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను మూడోసారి డ్రా తీయకుండా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి డ్రా పద్ధతి ద్వారా కాకుండా పాల్వంచలోని డివిజన్ల వారీగా అధికారులు అసలు ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి మాత్రమే ఇండ్లు కేటాయించి సొంతింటి కలను నెరవేర్చే విధంగా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి...)

వంటి ఘటనలు చోటుచేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేసిన విషయాన్ని సీఎస్ ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించాలని సీఎస్ తెలిపారు. పాఠశాలలో వంటశాలలను ఆధునీకరించే అవకాశం ఉన్న చోట్ల పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను ఉన్నత స్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని సంజయ్ జాజు తెలిపారు. విద్యాసంస్థల్లోని సౌకర్యాలు, లోపాలు, చేపట్టిన పరిష్కార చర్యల వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. జిల్లాలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ప్రతికూల నివేదికలు వచ్చినప్పుడు అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని సీఎస్ సూచించారు. ఏదైనా సమాచారం తప్పుడు ప్రచారంగా ఉన్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, వాస్తవంగా సమస్య ఉన్నట్లు తేలితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి అమలు చేస్తోందని, కాస్మెటిక్ ఛార్జీలను డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని సీఎస్ ఆదేశించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడికి అవసరమైన శిక్షణ అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇకపై ప్రతిరోజూ ఒక లక్ష యూనిఫారాలు కుట్టేలా చర్యలు తీసుకోవాలని, దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా అప్‌డేట్ చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కలెక్టర్లను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు రెసిడెన్షియల్ విద్యాసంస్థలను క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, ఆహారం, పారిశుధ్యం, హాజరు, మౌలిక వసతులపై నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలను ముందుగానే గుర్తించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వెచ్చని నీరు, దుప్పట్లు తదితర అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందించేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు.జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించిన వివరాలు, సమస్యలు, చేపట్టిన పరిష్కార చర్యలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తామని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపడతామని కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, బీసీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి , ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని శ్రీలత సంబంధిత శాఖల అధికారులు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి





(మొదటి పేజీ తరువాయి...)

రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపేందుకు ప్రజావాణి కార్యక్రమం కీలక వేదికగా పనిచేస్తుందన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు

**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని వినతులు**

పాల్వంచ మండలం బసవతారక కాలనీకి చెందిన బానోతు వీరు నాయక్, సోములగూడెం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 62/85లోని 5.31 కుంటల వ్యవసాయ భూమికి విద్యుత్ సదుపాయం కల్పించేందుకు ఎన్‌ఓసీ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరుతూ వినతి సమర్పించారు. పట్టా లేని కారణంగా ఎన్‌ఓసీ జారీ చేయడం లేదని, తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసినప్పటికీ జాప్యం జరుగుతోందని వివరించారు. ఈ వినతిని పరిశీలించిన కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో, విద్యుత్ శాఖ అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు. అశ్వారావుపేట మండలం గుర్రాలచెరువు గ్రామానికి చెందిన బొక్క అనసూర్య, తన కుమార్తె మొదటి కాన్పు ఆర్థిక సహాయం కోసం జిల్లా కార్మిక శాఖలో దరఖాస్తు చేసి రెండేళ్లు గడిచినా ఇప్పటివరకు క్లెయిమ్ మొత్తం ఖాతాలో జమ కాలేదని తెలిపారు . తనకు రావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కార్మిక శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన వడ్లనపు లత, డిగ్రీ వరకు చదివిన తనకు అంగన్వాడీ హెల్పర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ వయస్సు కొన్ని నెలలు అధికంగా ఉందనే కారణంతో దరఖాస్తును నిరాకరిస్తున్నారని తెలిపారు. తన దరఖాస్తును మరోసారి పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. మణుగూరు మండలం ఆర్లపురం గ్రామానికి చెందిన తాటి వెంకటమ్మ, సర్వే నంబర్ 17లోని 1.20 కుంటల భూమి సింగరేణి ఓపెన్‌కాస్ట్ పరిధిలో కోల్పోతున్నానని తెలిపారు. అయితే రికార్డుల్లో 0.24 కుంటల భూమి మాత్రమే నమోదై ఉండగా, మిగిలిన 0.36 కుంటల భూమి రికార్డుల్లో నమోదు కాలేదని తెలిపారు . తన భూమిని రీ-సర్వే చేసి రికార్డులను సరిచేయాలని కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని మణుగూరు తహసీల్దార్‌కు ఎండార్స్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన కవిత, పదో తరగతి వరకు చదువుకున్నానని, తన భర్త గుండెపోటుతో మరణించడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. కుటుంబ పోషణకు ఉపాధి కల్పించాలని కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. ఈకార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## మానవత్వానికి ప్రతిరూపంగా కడాలి నాగరాజు సేవలు

- నిరాశ్రయంగా జీవిస్తున్న 70 ఏళ్ల
- వృద్ధుడను వృద్ధాశ్రమంలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్న కడాలి





**భద్రాచలం, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి ):** అనాథలు, నిరాశ్రయులు, వృద్ధుల పట్ల మానవత్వంతో స్పందిస్తూ ప్రముఖ సామాజిక సేవకుడు కడాలి నాగరాజు చేస్తున్న సేవలు అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. తాజాగా గత రెండు సంవత్సరాలుగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కొత్త మార్కెట్ సమీపంలో నిరాశ్రయంగా జీవిస్తున్న 70 ఏళ్ల పెరుమాళ్ల కృష్ణను సోమవారం సరోజినీ వృద్ధాశ్రమంలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ జేడీ ఫౌండేషన్ ద్వారా ఎంతోమందికి ఆహార పొట్లాలు అందించి అండగా నిలిచిన ఘనత కడాలి నాగరాజుకు ఉంది. అంతే కాకుండా గ్రీన్ భద్రాద్రి కార్యక్రమాల ద్వారా మొక్కలు నాటి కూడా తనదైన రీతిలో సేవా కార్యక్రమాలు సమాజ సేవకు కృషి చేస్తున్నాడు. నిరుపేదలు, వృద్ధులు, నిరాశ్రయులకు తనవంతు సహాయాన్ని అందిస్తూ ముందుకు సాగుతున్న కడాలి నాగరాజు సేవలను పలువురు అభినందించారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఎన్నికలు ఏకగ్రీవం

- చైర్మన్‌గా డా. ఎస్.ఎల్ కాంతారావు, వైస్ చైర్మన్‌గా చల్లగుల్ల నాగేశ్వరరావు
- పాల్వంచ ఐఆర్‌సీఎస్ భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తాం....జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 28, (ప్రజాజ్యోతి )** కొత్తగూడెం కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్ ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. జిల్లా శాఖ నూతన చైర్మన్‌గా డా. ఎస్.ఎల్. కాంతారావు, వైస్ చైర్మన్‌గా చల్లగుల్ల నాగేశ్వరరావు, కోశాధికారిగా తోటమల్ల బాలయోగి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా వై. సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 11 మంది మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించిన అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ అంకిత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారులను నూతన కమిటీ సభ్యులు అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా జిల్లాలో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పాల్వంచలో ఐఆర్‌సీఎస్‌కు కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని అన్ని రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐఆర్‌సీ ఎ స్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్ ) కార్యక్రమాలను నిర్వహించేలా ఐ క్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించడంతో పాటు, రెడ్ క్రాస్ సేవలను విద్యార్థులు, ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు జిల్లా శాఖ అభివృద్ధికి, సేవా కార్యక్రమాల విస్తరణకు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు.





# గుంత గుంతకు "యమగండమే"

- ప్రమాదకరంగా భద్రాచలం రహదారులు
- పర్ణశాల వెళ్లేందుకు భక్తులకు తప్పని తిప్పలు
- ఇసుక లారీల రాకపోకలతో అధ్వానంగా మారుతున్న రహదారి
- లారీల వేగానికి పలువురు మృతి చెందినా మారని పరిస్థితి
- ప్రేక్షక పాత్ర పోషిస్తున్న సంబంధిత అధికారులు







**భద్రాచలం, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి ):** భద్రాచలం పట్టణంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారి ప్రమాదకరంగా తయారయ్యాయి. ముఖ్యంగా చర్ల , కూనవరం రోడ్లు ప్రధాన మార్గంలో అడుగడుగునా ఏర్పడిన గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి అధ్వాన స్థితి కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. భద్రాచలం నుంచి పర్ణశాల వైపు వెళ్లే భక్తులు, పర్యాటకులు సైతం రహదారి దుస్థితితో ఇబ్బందులు పడుతున్నారు.

### ›› ప్రమాదకరంగా భద్రాచలం రహదారులు

ప్రధానంగా చర్ల రోడ్డులోని గురుకుల పాఠశాల ఎదురుగా రోడ్డు గుంతలతో అస్తవస్తంగా ఉంది. గాయత్రి దేవి గుడి ఎదురుగా రోడ్డు నడి బొడ్డున కల్వర్టుకు గుంత ఏర్పడి ప్రమాదకరంగా తయారవుతుంది. అదేవిధంగా కొత్త మార్కెట్ ఎదురుగా రోడ్డు గుంతలతో శిథిలావస్థకు చేరుకుంటుంది. కూనవరం రోడ్లో సైతం పలుచోట్ల భారీ గుంతలో ప్రమాదకరంగా తయారవుతున్నాయి. వర్షం వస్తే ఏది రోడ్డో ...ఏది గుంతో.... తెలియని పరిస్థితి. రోజు ఈ మార్గం గుండా ప్రయాణించే వారికి ఎక్కడ ఏముందో తెలుస్తుంది. పర్యాటక ప్రాంతం కావడంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు రహదారి దుస్థితి తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు.

### ›› ఇసుక లారీల రాకపోకలతో అధ్వానంగా మారుతున్న రహదారులు

ప్రధానంగా ఇసుక లారీల అధిక లోడులతో నిరంతరం తిరుగుతుండడంతో ప్రధాన రహదారులు మరింత దెబ్బతింటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లారీలు వేగంగా ప్రయాణించడం వల్ల గతంలో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రహదారిపై ప్రమాదకర గుంతలను పూడ్చడం జరిగింది. అదేవిధంగా నన్నపనేని మోహన్ పాఠశాల సమీపంలో ఏర్పడిన ప్రమాదకర గుంతను లక్ష్మణ్ అనే స్థానికుడు కాంక్రీట్ తో మరమ్మతులు చేయడం జరిగింది. మరల ఇసుక లారీలు అధిక లోడుతో తిరుగుతుండడం కథ మొదటికి వచ్చింది.

### ›› ప్రేక్షక పాత్ర పోషిస్తున్న సంబంధిత అధికారులు

రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి మరమ్మతులు చేపట్టాలని పలు పత్రికలలో పలుమార్లు ప్రచురించినప్పటికీ అధికారులు నుంచి స్పందన కరువు. ఎంతసేపటికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి గుంతలు పూడుస్తున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రహదారిపై ఏర్పడిన భారీ గుంతలను తక్షణమే పూడ్చి, నాణ్యమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు ఇసుక లారీల వేగాన్ని నియంత్రించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. అధికారులు స్పందించి రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో బహిరంగ అక్రమాలు

- విలేకరుల సమావేశంలోపాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 28, (ప్రజాజ్యోతి )** పాల్వంచ పట్టణంలోని నవభారత్ ఏరియాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు వ్యవహారంలో పేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదని పాల్వంచ ఎక్కువ ఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపల్లి కనకేష్ అన్నారు, సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవభారత్ వద్ద చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు వ్యవహారంపై స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారుల వైఖరి ప్రజాప్రతినిధుల తీరు తీవ్ర నిర్లక్ష్యంగా, చట్టవిరుద్ధంగా మారిందన్నారు, గతంలో అధికారికంగా డ్రా తీసి, స్లిప్పులు ఇచ్చి, తహసీల్దార్ నోటీస్ బోర్డులో ప్రదర్శించిన 380 మంది పేద లబ్ధిదారుల నోటి కాడ గూడును లాక్కొనే కుట్ర జరుగుతోందని ఈ వైఖరి ఇక్కడతో ఆపకపోతే తీవ్ర స్థాయిలో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు, అధికారికంగా ఇచ్చిన స్లిప్పులకు విలువ లేదా? అని 2023వ సంవత్సరంలో పాల్వంచ ,పాత 24 వార్డుల నుండి 1,976 మంది అర్హులను పరిశీలించిన తర్వాత, అప్పటి శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పాత ఆర్డీవో కార్యాలయంలో బహిరంగంగా డ్రా తీసి 380 మందికి స్లిప్పులు ఇచ్చారు. తహసీల్దార్ ఆఫీస్ నోటీస్ బోర్డులో అధికారికంగా పేర్లు పెట్టారు. ఈరోజు వరకు ఆ కేటాయింపులను రద్దు చేస్తున్నట్లు ఒక్క అధికారిక నోటీసు కూడా ఇవ్వకుండా, ఆ 380 మందిని ఏ ప్రాతిపదికన పక్కన పెట్టారని, ఈ విషయంపై అధికారులు సమాధానం చెప్పాలన్నారు, పాత వారిని మాయం చేసి, కొత్తగా డ్రా తీయడం వెనుక రహస్యం ఏమిటని ప్రశ్నించారు, గత మూడేళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు ఒక తట్టడు మట్టి పోయలేదు, ఒక్క ఇటుక పెట్టలేదు. కానీ తీరా ఇప్పుడు ప్రస్తుత శాసనసభ్యులు, రెవెన్యూ అధికారులు ఈ నెల 24వ తేదీన పెద్దమ్మ గుడి వద్ద క్రొత్తగా 360 మందికి డ్రా తీయడం వెనుక ఉన్న రాజకీయం ఏమిటి? గతంలో ఎంపికైన పేదలు ఈ మూడేళ్లలో కోటీశ్వరులు అయిపోయారా? లేక వారి అర్హత ఏ రకంగా పోయింద నీ ప్రశ్నించారు,రాజకీయ నాయకులు మారితే పేదల హక్కులు మారతాయా అనిప్రభుత్వాలు, శాసనసభ్యులు మారిన ప్రతిసారీ పాత లబ్ధిదారుల లిస్టులను చెత్తబుట్టలో వేసి, కొత్తగా డ్రాలు తీసుకుంటూ పోతే పేద ప్రజలు పిచ్చివాళ్లా? గతంలో ఎంపిక చేసిన వారిలో ఎవరైనా అనర్హులు ఉంటే, విచారణ జరిపి వారిని మాత్రమే తొలగించాలి తప్ప, మొత్తం 380 కుటుంబాల హక్కులను కాలరాయడం ఎంతవరకు సమంజసమన్నారు, నవభారత్ ఏరియాలో ఉన్న మొత్తం ఇళ్ల సంఖ్య ఎంత? గతంలో తీసిన 380 మందికి నిన్నగాక మొన్న తీసిన 360 మందికి సరిపోను ఇళ్లు అక్కడ ఉన్నాయా? ఉన్నవి తక్కువ ఇళ్లయితే, మిగతా వారికి ఎక్కడ ఇస్తారు? అధికారులు స్పష్టమైన లెక్కలు బయట పెట్టాలన్నారు, 2023లో అధికారికంగా డ్రా ద్వారా ఎంపికై, స్లిప్పులు పొందిన 380 మంది బాధితులకు తక్షణమే ఇళ్లను కేటాయించాలన్నారు, ఇటీవల చట్టవిరుద్ధంగా చేపట్టిన 360 మంది కొత్త డ్రా ప్రక్రియను వెంటనే రద్దు చేయాలి.పాత జాబితా ఆధారంగానే నిజమైన అర్హులకు ఇళ్లు అందేలా పారదర్శకంగా సర్వే చేపట్టాలన్నారు, ఈ అక్రమాలపై స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి గతంలో ఎంపికైన 380 మందికి స్పష్టమైన హామీ ఇవ్వకపోతే, బాధితులందరినీ ఏకం చేసి మాన్యులైన తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసి న్యాయపోరాటం చేస్తామన్నారు, అంతేకాకుండా అధికారుల, ప్రజాప్రతినిధుల తీరును నిరసిస్తూ కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, ముట్టడి కార్యక్రమాలు చేపడతామని అన్నారు, ఈ విలేకరుల సమావేశంలో మారుమూళ్ల కిరణ్, పూజల ప్రసాద్, కాంపెల్లి నవీన్, కడలి సత్యనారాయణ, గుగులోతు శ్యామ్ కుమార్, కాంపెల్లి భార్గవ్ నితీష్, కడలి రామకృష్ణ, గజేంద్రుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందులో బైక్ ఫైనాన్స్ ఆగడాలకు అడ్డుకట్ట లేదా?

- విక్రయదారుడికి సమాచారం లేకుండానే బైక్ తరలింపు..
- పార్కింగ్ చేసిన వాహనాన్ని ఎలా తీసుకెళ్తారని ప్రశ్న
- నోటీసులు ఇవ్వకుండానే బైక్ స్వాధీనం చేసుకున్నారంటూ బాధితుడి ఆవేదన
- ఫైనాన్స్ సంస్థల తీరుపై నియంత్రణ అవసరమంటున్న స్థానికులు
- జిల్లా అధికారులు జర స్పందించరూ

**ఇల్లందు, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి)** ఇల్లందు పట్టణంలో ద్విచక్ర వాహనాల ఫైనాన్స్ వ్యవహారాల్లో అనుసరిస్తున్న తీరుపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రుణ బకాయిలు ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకునే క్రమంలో సంబంధిత వాహన యజమానులకు, విక్రయదారులకు సరైన సమాచారం ఇవ్వకుండా వాహనాలను తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా పట్టణంలో చోటుచేసుకున్న ఓ ఘటనపై బాధితుడు ఆవేదన వ్యక్తం చేయడంతో ఫైనాన్స్ సంస్థల వ్యవహార శైలిపై చర్చ మొదలైంది.

**విక్రయదారుడికి తెలియకుండానే తరలింపు?**

బైక్ కొనుగోలు, ఫైనాన్స్ ప్రక్రియలో విక్రయదారుడి పాత్ర ఉన్నప్పటికీ, వాహనం స్వాధీనం చేసుకునే సమయంలో కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడంపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. విక్రయదారుడికి తెలియకుండానే బైక్‌ను తీసుకెళ్లడం ఏ మేరకు సమంజసమని బాధితుడు ప్రశ్నిస్తున్నాడు. వాహనం ఎక్కడి నుంచి, ఏ పరిస్థితుల్లో తీసుకెళ్లారనే విషయంపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

**పార్కింగ్ చేసిన బైక్‌ను ఎలా తీసుకెళ్తారు?**

వాహనాన్ని యజమాని ఒక ప్రదేశంలో పార్కింగ్ చేసిన సమయంలో, సంబంధిత వ్యక్తికి సమాచారం లేకుండా దాన్ని అక్కడి నుంచి తరలించడం చర్చనీయాంశంగా మారింది. వాహనం తీసుకెళ్లే ముందు యజమానికి సమాచారం ఇవ్వడం, బకాయిల వివరాలు తెలియజేయడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పార్కింగ్ చేసిన వాహనాన్ని ఎవరికీ తెలియకుండా తీసుకెళ్లడం వల్ల భవిష్యత్‌లో వివాదాలు తలెత్తే అవకాశం ఉందని అంటున్నారు.

**నోటీసులు ఇవ్వకుండానే స్వాధీనం చేసుకున్నారా?**

తనకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదని బాధితుడు ఆరోపిస్తున్నాడు. బకాయిలు ఉన్నట్లయితే వాటి వివరాలను తెలియజేసి, చెల్లింపులకు అవకాశం కల్పించాల్సి ఉండగా, నేరుగా వాహనాన్ని తీసుకెళ్లడంపై అతను అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాడు. వాహనం స్వాధీనం ప్రక్రియలో అనుసరించిన నిబంధనలు ఏమిటి? సంబంధిత వ్యక్తికి ఎలాంటి సమాచారం అందించారు? అనే అంశాలపై స్పష్టత అవసరమని చెబుతున్నారు.

**ఫైనాన్స్ సంస్థల తీరుపై ప్రశ్నలు?**

ద్విచక్ర వాహనాల కొనుగోలుకు ఫైనాన్స్ సౌకర్యం అందించడం సాధారణంగా మారిన నేపథ్యంలో, రుణ బకాయిల వసూళ్లలో సంస్థలు పాటించే విధానంపై వినియోగదారుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. బకాయిలు ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకునే సమయంలో సంబంధిత ఒప్పందాలు, వర్తించే నిబంధనలు, చట్టబద్ధమైన ప్రక్రియలను పాటించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**బాధితులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి**

రుణ బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత వాహనదారులదేనని, అదే సమయంలో బకాయిల వసూళ్లలో ఫైనాన్స్ సంస్థలు కూడా పారదర్శకమైన విధానాన్ని పాటించాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. ముందస్తు సమాచారం, సరైన నోటీసులు, వాహనం స్వాధీనం ప్రక్రియపై స్పష్టత ఉండేలా చర్యలు చేపడితే వివాదాలకు తావు ఉండదని అంటున్నారు.

**అధికారులు దృష్టి సారించాలి**

ఇల్లందులో బైక్ ఫైనాన్స్ సంస్థలు, రికవరీ ఏజెంట్లు అనుసరిస్తున్న విధానాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. రుణదాతల హక్కులతో పాటు వాహన యజమానుల హక్కులు కూడా పరిరక్షించేలా స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఫైనాన్స్ పేరుతో వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా, చట్టబద్ధమైన పద్ధతుల్లోనే వాహనాల స్వాధీనం ప్రక్రియ కొనసాగాలని కోరుతున్నారు.

## ఆయిల్‌ఫెడ్ భూముల ప్రైవేటీకరణపై దమ్మపేట రైతుల నిరసన

- భూములను సంస్థకే కేటాయించాలని డిమాండ్
- హైదరాబాద్‌లో రైతుసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన




**దమ్మపేట, సెప్టెంబరు. 28 (ప్రజాజ్యోతి ):** ఆయిల్ ఫెడ్‌కు కేటాయించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలను నిరసిస్తూ దమ్మపేట మండల పామాయిల్ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బస్‌భవన్ ఎదుట ఆయిల్ ఫెడ్ కార్యాలయం వద్ద సోమవారం అఖిలపక్ష రైతుసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో దమ్మపేట రైతుసంఘం నాయకులు పాల్గొని తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు.ఆయిల్ ఫెడ్‌కు సంబంధించిన భూములను ప్రైవేటు వ్యక్తులకు కేటాయించకుండా సంస్థ అవసరాలకే వినియోగించాలని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రావణ్‌కుమార్, మాజీ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, తీగల సాగర్, మహేశ్వరరెడ్డి, కె.పుల్లయ్య తదితరులు పాల్గొని ఆయిల్ ఫెడ్ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా తీగల సాగర్ మాట్లాడుతూ పామాయిల్ రైతులు, ప్రజల ఆందోళనల నేపథ్యంలో ప్రైవేటు వ్యక్తులకు భూములు కేటాయిస్తూ జారీ చేసిన జీవోను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసినట్లు ప్రకటించిందన్నారు. అయినప్పటికీ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుమారు 16 వేల గజాల ఆయిల్‌ఫెడ్ భూముల విషయంలో ప్రైవేటీకరణ ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.జారీ చేసిన జీవోను పూర్తిగా రద్దు చేసి ఆయిల్ ఫెడ్ భూములను సంస్థకే కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారమయ్యే వరకు పామాయిల్ రైతుల పోరాటం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట మండల రైతు సంఘం నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ, జంగారెడ్డి, శోభన్, చలికాని సూరిబాబు, కారం శ్రీరాములు, రాము, మోరంపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ కు భారత రత్న అవార్డు ప్రకటించాలి

- సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా భగత్ సింగ్ 119వ జయంతి వేడుకలు




**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 28 , (ప్రజా జ్యోతి )** బ్రిటీష్ పరాయి పాలకుల నుంచి భరతమాత విముక్తి కోసం నూనూగు మీసాలతో ఉరికయ్యని ముద్దాడిన షాహిద్ భగత్ సింగ్ కు భారత రత్న అవార్డును ప్రకటించాలని సిపిఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్(సీపీఐ కార్యాలయంలో ) భగత్ సింగ్ 119వ జయంతి సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరము వారు మాట్లాడుతూ భారత్ దేశానికి స్వాతంత్ర్యం కోసం ఈ దేశ ప్రజలును, యువతను ఏకం చేసి స్వాతంత్ర సంగ్రామంనీ ముందికు తీసుకొని వెళ్లటంలో కీలకపాత్ర పోషించిన భగత్ సింగ్ కు భారత రత్న అవార్డు ప్రకటించకుండా పాలకులు ఆయన పోరాటపటమను అవమానిస్తున్నారని అన్నారు. భారతదేశం ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వ దేశంగా మారింది అన్నారు. పదిశాతం మంది ధనికులు తొంబై శాతం మంది దరిద్రులూ ఈ దేశంలో ఉన్నా కూడా ఆర్థిక స్థితిగతుల్లో ప్రపంచానికే మార్గ దర్శకం మన దేశం ఉన్నట్లు పాలకులు ప్రపంచానికి చూపటం అన్యాయమని అని అన్నారు. దేశ స్వాతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేసి ప్రాణాలను సైతం అర్పించిన వీర కిషోరం షాహిద్ భగత్ సింగ్ స్ఫూర్తిగా దేశం లౌకిక వ్యవస్థను కాపాడుకోవడం కోసం, మతోన్మాదుల నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధం కావాలని కోరారు. అమరుల ఆశయాలు ముందుకు తీసుకు వెళుతూ వారు కలలు కన్న దేశాన్ని నిర్మించినప్పుడే వారికి నిజమైన నివాళులు అర్పించిన వారవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, టీడీపీ సీనియర్ నాయకులు కనగాల అనంతరములు, కార్పొరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నామ వినోద్, ధారావత్ దినేష్, వడ్డే కిరణ్, సీపీఐ నాయకులు మన్యం వెంకన్న, వేములపల్లి శ్రీను, కోరే కృష్ణ, కాసర్ల రామారావు, బీవీ సత్యనారాయణ, జకరయ్య, రమేష్, అల్లి వెంకటేశ్వర్లు, కిరణ్ కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో నశా ముక్త భారత్‌పై విద్యార్థులకు అవగాహన
- విద్యార్థులతో నశా ముక్త యువ ప్రతిజ్ఞ చేయించిన వైద్యాధికారిణి డాక్టర్ నాజ్నిన్ తబ్సుం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 28, (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నశా ముక్త భారత్ కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ నాజ్నిన్ తబ్సుం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యువత మత్తు పదార్థాలు, వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. శారీరక, మానసిక వికాసానికి విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఎలాంటి దురలవాట్లకు లోనుకాకుండా క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులందరితో నశా ముక్త యువ ప్రతిజ్ఞ చేయించారు. యుక్త వయస్సులో బాలికల్లో చోటుచేసుకునే శారీరక, మానసిక మార్పులతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, చిన్న వయస్సు నుంచే మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విద్యాబోధకురాలు జయలక్ష్మి , ఆశా కార్యకర్తలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమవారం శివసన్నిధిలో మార్మోగిన రుద్రాభిషేక మంత్రాలు

- 116 లీటర్ల పాలతో మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం చేయించిన చామకూరి ప్రసాద్–ధనలక్ష్మి దంపతులు
- మొక్కు ఫలించిన సందర్భంగా చామకూరి ప్రసాద్–ధనలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 28, (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానంలో సోమవారం ఉదయం నుంచే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సోమవారం శివారాధనకు విశేష ప్రాధాన్యత ఉండటంతో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేక కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైరా గ్రామానికి చెందిన చామకూరి ప్రసాద్–ధనలక్ష్మి దంపతులు స్వామివారిని కోరుకున్న మొక్కు ఫలించడంతో కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి 116 లీటర్ల పాలతో స్వామివారికి ప్రత్యేక పాలాభిషేకం చేయించారు. అనంతరం హారతి కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. మొక్కు ఫలించిన సందర్భంగా చామకూరి ప్రసాద్–ధనలక్ష్మి దంపతులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కుటుంబ సమేతంగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. వైరా గ్రామస్తులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం, పూజా కార్యక్రమాలు సజావుగా జరిగేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్వామివారి సేవలో ఆలయ మేనేజర్ పి.వి. రమణ పాల్గొని పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.



## కస్తూర్బా పాఠశాలను సందర్శించిన జిల్లా జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ జానకీ దేవి

- తరగతులు, పరిసరాల పరిశుభ్రత, వంటగది, వసతి గృహం, రికార్డుల పరిశీలన






**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 28, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా బాలికల పాఠశాలను జిల్లా జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ జానకీ దేవి సోమవారం సందర్శించారు. ఉదయం నుంచి పాఠశాలలోని తరగతుల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధన, పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటగదిని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, వంట సామగ్రి నిల్వల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాన్ని పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించి వాటి నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు.అనంతరం కాంట్రాక్టు ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సిబ్బంది అందరూ సమన్వయంతో పని చేసి విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని జానకీ దేవి తెలిపారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కస్తూర్బా పాఠశాల సిబ్బంది విద్యార్థులకు అన్ని విధాలా సహకరించి, తమ సొంత పిల్లలుగా భావించి శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ సూచించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సహాయ ప్రత్యేక అధికారులు స్వప్న, రజని, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటు నమోదు ప్రతి ఒక్కరి బాధ్యత

- దమ్మపేట మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దొడ్డా రమేష్ పిలుపు



**దమ్మపేట, సెప్టెంబరు. 28 (ప్రజా జ్యోతి):** ఖమ్మం–నల్లగొండ–వరంగల్ పట్ట భద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ పేరును నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు దొడ్డా రమేష్ కోరారు. పట్టభద్రుల సమస్యలను శాసన మండలిలో సమర్థవంతంగా ప్రస్తావించేందుకు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ముఖ్యమని తెలిపారు. 2023 నవంబర్ 1వ తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు ఓటరు నమోదుకు అర్హులని పేర్కొన్నారు. ఇప్పటికే ఓటు ఉన్నవారితో పాటు కొత్తగా అర్హత పొందిన పట్టభద్రులు కూడా ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని సూచించారు.

### ›› నమోదు కోసం అవసరమైన పత్రాలు

ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, డిగ్రీ లేదా గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్, పాస్‌పోర్టు సైజు ఫొటో, మొబైల్ నంబర్ తదితర వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు.పట్టభద్రుల సమస్యలు, హక్కులకు సంబంధించిన అంశాల్లో తమ భాగస్వామ్యాన్ని నమోదు చేసుకోవడానికి ఓటు హక్కు ముఖ్యమైనదని దొడ్డా రమేష్ పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లోని ఇతర అర్హులైన పట్టభద్రులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు.

# మున్సిపల్ ఆఫీసులో దొంగలు పడ్డారా?

- కీలక ఫైళ్లు మాయం.. ఆర్టీఐకి చిత్రమైన సమాధానం!
- మూడేళ్ల క్రితం నిర్మించిన భవనం ఫైలే కనిపించకపోతే.. పాత రికార్డుల పరిస్థితి ఏంటి?
- కమిషనర్ మౌనం వెనుక మర్మమేంటి?

**అశ్వారావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 28**

అశ్వారావుపేట పురపాలక సంఘ కార్యాలయంలో కీలక రికార్డుల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా అవసరాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు ఆర్టీఐ ద్వారా వివరాలు కోరితే..సంబంధిత సమాచారానికి బదులుగా "మీరు కోరిన సమాచారం యొక్క వివరాలు" అంటూ అస్పష్టమైన సమాధానం ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది.ముఖ్యంగా సుమారు మూడు, నాలుగు సంవత్సరాల క్రితం నిర్మించిన భవనానికి సంబంధించిన వివరాలే మున్సిపల్ రికార్డుల్లో అందుబాటులో లేవనే పరిస్థితి ఉంటే.. గతంలో నిర్మించిన భవనాలు, అనుమతులు, ప్లాన్లు, పన్ను రికార్డులు, నిర్మాణ వ్యయాలు, ఇతర కీలక దస్తావేజుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ›› ఫైలు లేదు... సమాచారం లేదు!

మున్సిపాలిటీలో ఒక భవనానికి సంబంధించిన ఫైలు లేదా దాని వివరాలు అందుబాటులో లేకపోవడం సాధారణ పరిపాలనా లోపమా? లేక రికార్డుల నిర్వహణలో తీవ్రమైన నిర్లక్ష్యమా? అన్నది తేలాల్సి ఉంది.ఒకవేళ రికార్డులు నిజంగానే మాయమైతే.. ఎప్పుడు మాయమయ్యాయి? ఎవరి ఆధీనంలో ఉన్నప్పుడు మాయమయ్యాయి? రికార్డులు భద్రపరిచే బాధ్యత ఎవరిది? వాటిని తిరిగి సేకరించేందుకు ఏ చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.




### ›› "ఇంటి దొంగలను..." సామెత గుర్తుకొస్తోందా?

కీలక ఫైళ్లు కార్యాలయం బయటకు వెళ్లకుండా, సురక్షితంగా భద్రపరచాల్సిన బాధ్యత అధికారులదే. అలాంటి ఫైళ్లు కనిపించకపోతే బయట వ్యక్తులపై అనుమానం వ్యక్తం చేయడం కంటే ముందుగా అంతర్గత రికార్డు నిర్వహణ వ్యవస్థను పరిశీలించాల్సిన అవసరం ఉంది.దీంతోనే స్థానికంగా "ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టుకోలేడు" అనే సామెతను గుర్తుచేసుకుంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ వ్యాఖ్యలకు వాస్తవ ఆధారాలున్నాయా? అన్నది అధికారిక విచారణలోనే తేలాల్సి ఉంది.

### ›› కమిషనర్ మౌనం ఎందుకు?

ఆర్టీఐ ద్వారా సమాచారం కోరిన సందర్భంలో స్పష్టమైన రికార్డులు అందుబాటులో లేకపోవడంపై మున్సిపల్ కమిషనర్ ఎందుకు వివరణ ఇవ్వడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.రికార్డులు లేవా?ఫైలు కనిపించడం లేదా?లేక సమాచారం ఇవ్వడంలో ఏదైనా పరిపాలనా సమస్య ఉందా?కమిషనర్ మౌనం వీటిలో ఏదో ఒకదానికి సమాధానంగా మారుతుందా? లేక అధికారికంగా చెప్పడానికి ఇంకేదైనా కారణం ఉందా? అనేది స్పష్టత రావాల్సిన అంశం.

### ›› షాడో అధికారి ఎవరైనా ఉన్నారా?

మున్సిపల్ కార్యాలయంలో అధికారికంగా ఉన్నతాధికారులు, సిబ్బంది ఉన్నప్పటికీ కొన్ని కీలక నిర్ణయాలు లేదా వ్యవహారాల వెనుక కనిపించని మరో వ్యవస్థ పనిచేస్తుందనే అనుమానాలు ఉంటే వాటిని కూడా అధికారులు నివృత్తి చేయాల్సిందే.అసలు నిర్ణయాలు తీసుకునేది ఎవరు?రికార్డులపై పర్యవేక్షణ ఎవరిది?కమిషనర్‌కు తెలియకుండా ఫైళ్లు కదులుతున్నాయా?లేక కమిషనర్‌కు తెలిసే ఈ వ్యవహారాలు జరుగుతున్నాయా?

### ›› పాత రికార్డుల పరిస్థితి ఏమిటి?

మూడేళ్లు, నాలుగేళ్ల క్రితం నిర్మించిన భవనానికి సంబంధించిన రికార్డులే అందుబాటులో లేకపోతే.. అంతకంటే పాత నిర్మాణ అనుమతులు, లేఅవుట్లు, పన్ను రికార్డులు, అక్రమ నిర్మాణాలపై చర్యలకు సంబంధించిన ఫైళ్లు, ప్రభుత్వ ఆస్తుల వివరాలు వంటి కీలక రికార్డులు భద్రంగా ఉన్నాయా? అనే సందేహం సహజంగానే తలెత్తుతోంది.ఒక్క ఫైలు గల్లంతా? లేక రికార్డుల వ్యవస్థే గల్లంతా?

### ›› ఉన్నతాధికారులు విచారణ చేస్తేనే అసలు విషయం!

ఆర్టీఐలో కోరిన సమాచారం ఎందుకు అందుబాటులో లేదో, సంబంధిత ఫైలు చివరిగా ఎవరి వద్ద ఉందో, రికార్డు రిజిస్టర్‌లో దాని నమోదు ఏమిటో, ఫైలు మిస్సింగ్‌గా గుర్తించినట్లయితే తీసుకున్న చర్యలేమిటో ఉన్నతాధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

## జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో దమ్మపేట జట్ల ప్రతిభ

- కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్‌లో ప్రథమ స్థానాలు
- పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే జారె





**దమ్మపేట, సెప్టెంబరు. 28 (ప్రజాజ్యోతి):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అశ్వారావుపేట జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారం మందలపల్లి తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. అండర్–14, అండర్–17 విభాగాల్లో బాలురు, బాలికలకు కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.అశ్వారావుపేట జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, జట్టుగా పనిచేసే స్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు.

### ›› మూడు విభాగాల్లో దమ్మపేటకు ప్రథమ స్థానం

ఖో–ఖో పోటీల్లో అండర్–14, అండర్–17 బాలురు, బాలికల విభాగాల్లో దమ్మపేట జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. అశ్వారావుపేట జట్లు ద్వితీయ స్థానాన్ని సాధించాయి. కబడ్డీ పోటీల్లోనూ అండర్–14, అండర్–17 బాలురు, బాలికల విభాగాల్లో దమ్మపేట జట్లు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా, అశ్వారావుపేట జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి.వాలీబాల్ పోటీల్లోనూ అండర్–14, అండర్–17 బాలురు, బాలికల విభాగాల్లో దమ్మపేట జట్లు ప్రథమ స్థానాన్ని సాధించగా, అశ్వారావుపేట జట్లు ద్వితీయ స్థానాన్ని పొందాయి. దీంతో మూడు క్రీడా విభాగాల్లో దమ్మపేట విద్యార్థులు ప్రతిభ చాటారు.ముగింపు కార్యక్రమంలో దమ్మపేట మండల ఎంఈఓ జగపతి, అశ్వారావుపేట మండల ఎంఈఓ పాల్గొన్నారు. అశ్వారావుపేట జోనల్ వ్యాయామ ఉపాధ్యాయులు రామనాథం, పి. పవన్‌కుమార్, మల్లేష్, వెంకన్న, భద్రం, పద్మ, బద్రు, హసీరామ్, గోపాల్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు. పోటీల నిర్వహణకు సహకరించిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, నిర్వాహకులకు పాఠశాల క్రీడల సమాఖ్య అశ్వారావుపేట జోనల్ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

